


''గుడి కట్టించడం అనేది సప్తసంతానాలలో ఒకటని చెబుతారు. మనకెలాగూ పిల్లలు లేరు. ఈ రూపంగా అయినా ఆ లోటు తీరుతుంది'' అని చెప్పింది. ఆ మాటతో వర్తకుడు గుండె బద్దలైపోయింది. అంత ఖర్చుకు తన కంఠంలో ప్రాణం ఉండగా ఒప్పుకోలేడు. అందువల్ల..

''పిచ్చిదానా! గుడి కట్టిస్తే ఇంకేమైనా ఉందా? అది దొంగసొమ్ము. పట్టుబడితే శిక్ష తప్పదు. అందువల్ల ఓ పనిచేస్తాను. ఈ దేవీ విగ్రహాన్ని మహారాజుకు ఇచ్చేస్తాను. ఆయనే ఏదైనా చేయనీయి'' అంటూ భార్య ఎంత చెబుతున్నా వినిపించుకోకుండా.. ఆ విగ్రహాన్ని తీసుకుపోయి శ్రీదర్శనుడికి బహుమతిగా సమర్పించాడు. ఆ విగ్రహ చాతుర్యాన్ని గమనించిన శ్రీదర్శనుడు ఆ వర్తకుడికి రెండు గ్రామాలను బహుమతిగా ఇచ్చాడు. ఆ తరువాత తన కోటకు ఎదురుగా గొప్ప దేవీ ఆలయాన్ని నిర్మించాడు. అందులో విగ్రహాన్ని ప్రతిష్ఠించి.. నిత్యం దేవిని అర్చించేవాడు.

ఆ దేవీ విగ్రహం వచ్చింది మొదలు రాజ్యంలో కరువు కాటకాలు లేకుండా పోయాయి. వానలు సకాలంలో పడసాగాయి. పంటలు చక్కగా పండుతున్నాయి. ప్రజలందరూ సుఖజీవనులై, నీతివర్తనులై మసలుకోసాగారు. ఇదంతా దేవీ మహిమే అని ప్రచారం జరిగింది. దాంతో ఆ గుడి ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా మారిపోయింది.

ఇలా ఉండగా ఒకనాటి తెల్లవారుజామునే శ్రీదర్శనుడు తన మిత్రుడైన ముఖరకుణ్ని వెతుక్కుంటూ వచ్చాడు. అప్పటికింకా ముఖరకుడు పక్కమీదనుంచి లేవనే లేదు. ఎదురుగా కనిపించిన మహారాజును చూసి నిర్ఘాంతపోయిన ముఖరకుడు..

''ఏమిటి?'' అని ప్రశ్నించేలోపుగా అతనే చెప్పాడు..

''మిత్రమా! నేను జూదంలో సర్వమూ కోల్పోయి ప్రాణత్యాగం చేయాలని సంకల్పించినప్పుడు నువ్వు భూనందన మహారాజు కథ చెప్పావు కదా! ఆ మహారాజు కలలో కనిపించిన చిన్నదాన్ని పొందడం కోసం పాతికేళ్లు తపస్సు చేశాడు. చివరికి పొందగలిగాడు. సరిగ్గా ఇప్పుడు నా విషయంలో కూడా అలాగే జరిగింది'' అన్నాడు.

''ఏమైంది మిత్రమా!'' అని అడిగాడు ముఖరకుడు.

''నిన్నరాత్రి నా కలలో ఒక దివ్యాంగన కనిపించింది. ఆమె నా ఒంటిమీద హారాలను తాను ధరించి.. తన నగలను నాచేత ధరింప చేసింది. చూడు వీటిని..'' అంటూ చూపాడు.

''నిజమే! ఇవి ఆడవాళ్ల నగలే..'' అని ఆశ్చర్యం వ్యక్తంచేశాడు ముఖరకుడు. మళ్లీ తనే..

''అయితే నువ్వు కూడా భూనందన మహారాజులాగా కలలో కనిపించిన సుందరిని చేపట్టగలవు'' అన్నాడు.

''కానీ ఆయనలాగా తపస్సు చేసే శక్తిమాత్రం నాకు లేదు సుమా! ఎలా నెరవేరుతుందో మరి కల?! అంతా దేవి దయ'' అని ఆ పూటకు వెళ్లిపోయాడు శ్రీదర్శనుడు.

అది జరిగిన మూడోనాడు ప్రతీహారి వచ్చి..

''మహారాజా! మీకోసం ఎవరో యోగిపుంగవులు వేచి ఉన్నారు. మీ సెలవైతే మీ ఎదుటకు తీసుకువస్తాను'' అన్నాడు.

''యోగులను ఆటంకపరచ కూడదురా శుంఠా! వెంటనే తీసుకురా'' అని కసురుకున్నాడు శ్రీదర్శనుడు.

ఆ యోగిని ఉచితాసనంపై కూర్చోబెట్టి తగినరీతిగా సత్కరించిన తరువాత..

''తమరు వచ్చిన పని సెలవివ్వండి మహాత్మా!'' అని కోరాడు శ్రీదర్శనుడు.

''రాజా! మాది మణిద్వీపం. ఇక్కడికి నాలుగు సముద్రాల అవతల ఉన్నది. అనంగచంద్రుడనే మహారాజు మా ద్వీపాన్ని పాలిస్తున్నాడు. నేను ఆయన పురోహితుణ్ని. మా మహారాజుకు అనంగలతిక అనే కూతురున్నది. ఆమె ఎంతో ఇష్టంగా పూజించుకుంటున్న దేవీ విగ్రహం దొంగలపాలైంది. దానిని వెతుక్కుంటూ బయల్దేరిన నాకు.. ఆ విగ్రహం మీ కోటముందే కొలువై ఉందని తెలిసింది. దయచేసి మా విగ్రహాన్ని మాకు అప్పగించేస్తే వెళ్లిపోతాను'' అన్నాడు.

ఆ మాటతో శ్రీదర్శనుడు ఒక్కక్షణం మ్రాన్పడిపోయాడు. కొద్దిగా తేరుకుని..

''మహాత్మా! అమ్మవారిని కొద్దిరోజుల కిందటే ఇక్కడ ప్రతిష్ఠించాం. ఆమెనిప్పుడు మా రాజ్య ప్రజలందరూ కొలుచుకుంటున్నారు. మేం ప్రతిష్ఠించిన దైవాన్ని మేమే మా చేజేతులా పెరికి ఇవ్వాలనడం న్యాయమా?! ఆ విగ్రహాన్ని మేం దొంగిలించలేదు. ఆమె తనంతతానుగా మా దగ్గరికి వచ్చింది. మీరు, మీ ప్రభువులు కూడా ఇక్కడికే వచ్చి అమ్మను దర్శించుకోవచ్చు. అందుకభ్యంతరం లేదు'' అని పలికాడు.

''మహారాజా! మా అనంగచంద్రుడు సామాన్యుడు కాదు. నీపై యుద్ధం ప్రకటించగలడు. తరువాత నీ ఇష్టం'' అన్నాడు పురోహితుడు.

''సంతోషం స్వామీ! మేము మా చేతులతో విగ్రహాన్ని పెరకలేం. ఆయనే వచ్చి, మాపై గెలిచి విగ్రహాన్ని పెరికితే మా తప్పుండదు. మీరెలా అనుకుంటే అలాగే కానివ్వండి'' అని రెండుచేతులూ ఎత్తి నమస్కరించాడు శ్రీదర్శనుడు.

ఆ యోగి ఆగమేఘాలమీద మణిద్వీపానికి వెళ్లాడు. తన ప్రభువుకు, అనంగలతికకు ఈ విషయాన్ని తెలియచేశాడు.

''మాళవరాజ్యంపై దండయాత్ర ప్రారంభించండి'' అని అప్పటికప్పుడు అనంగచంద్రుడు తన సైన్యాధ్యక్షుణ్ని ఆజ్ఞాపించాడు.

సముద్రమధ్యంలో ఉన్న రాజ్యం కనుక.. సైన్యాన్ని తరలించడం కష్టతరమైన ప్రక్రియ. ఆ ప్రక్రియ మొదలయ్యేలోపుగానే రాకుమార్తె అనంగలతిక, తన చెలికత్తెతో పాటు.. పురోహితుణ్ని వెంటపెట్టుకుని మారువేషంలో మాళవ రాజ్యానికి చేరుకుంది.

తన ఇష్టదైవానికి జరుగుతున్న ఉత్సవాలను, మహావైభోగాలను తిలకించి చాలా సంతోషించింది.

''గురుదేవా! ఈవిడ మన ఊరిలో ఉంటే ఇంత వైభవం ఉండదు కదా!'' అన్నది.

రాకుమార్తె మనసు మారుతున్నదని తెలిసి, గురువు సంతోషించాడు. అంతలో అక్కడికి శ్రీదర్శనుడు వచ్చాడు. అతణ్ని చూడగానే అనంగలతిక గుర్తించింది. ఒకనాడు తన స్వప్నంలో ఈ మహాపురుషుణ్ని ఆమె చూసింది. తన నగలను అతనికి ధరింపచేసి, అతని నగలను తాను దాల్చింది. అనంగలతిక తన నగలను శ్రీదర్శనుడి ఒంటిపై చూడగానే గుర్తించింది. కానీ శ్రీదర్శనుడు ఆమెను చూడలేదు.

ఈ విషయాన్ని ఆమె చెలికత్తె ద్వారా పురోహితునికి తెలియచేసింది. అనంగలతిక ఇచ్చిన హారాన్ని తీసుకుని, పురోహితుడు శ్రీదర్శనుడితో రాయబారం నిర్వహించాడు.

తన స్వప్నం నిజమైందని తెలిసి శ్రీదర్శనుడు సంతోషం పట్టలేకపోయాడు. అనంగలతికను తన ప్రియ భార్యగా చేపట్టడానికి వెనువెంటనే అంగీకారం తెలియచేశాడు. ఈలోగా మణిద్వీపంనుంచి సైన్యాలు వచ్చాయనే వార్త తెలియవచ్చింది. పురోహితుడు ముందుగా నగరు శివార్లలోకి వెళ్లి యుద్ధాన్ని విరమింప చేశాడు.

శ్రీదర్శనుడు – అనంగలతిక వివాహం మహావైభవంగా జరిగింది.

కాలగర్భంలో కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. శ్రీదర్శనుడికి ఇద్దరు భార్యల వల్ల ఇద్దరు పుత్రులు, మరికొందరు పుత్రికలు కలిగారు.

ఒకనాడు భార్యలతో అంతఃపురంలో వినోదిస్తుండగా వాకిట్లో ఎవరో బ్రాహ్మణుడు ఏడుస్తున్న సవ్వడి వినిపించింది. ఆ ఆక్రందన విని శ్రీదర్శనుడు భార్యాసమేతుడై బయటికి వచ్చాడు.

అప్పుడా బ్రాహ్మణుడు..

''నాలో అగ్నిదీప్తి పుడుతూనే అట్టహాసయుక్తితో ప్రజ్వరిల్లి ధూమరేఖలు ఎగసిపడతాయి. నేను చేపట్టిన ఈ దహనంతో కాలమనే మేఘం వల్ల కమ్మిన చీకట్లు చల్లారిపోతాయి'' అని అర్థం వచ్చే పద్యం చదివి, అంతర్ధానమైపోయాడు.

శ్రీదర్శనుడికి ఆ పద్యభావం ఏమిటో ఒక్కముక్కా అర్థం కాలేదు. కానీ, అతని భార్యలైన పద్మిష్ఠ, అనంగలతిక ఒక్కసారిగా విరుచుకు పడిపోయారు. నాడి అందలేదు. వైద్యులు వారిద్దరూ మృతిచెందినట్లుగా ప్రకటించారు. ఒకేసారి ఇద్దరు భార్యలనూ పోగొట్టుకున్న దుఃఖంలో శ్రీదర్శనుడు సొమ్మసిల్లి పడిపోయాడు. స్నేహితుడైన ముఖరకుడే జరగాల్సిన కార్యక్రమమంతా దగ్గరుండి జరిపించాడు.

మూడోనాటికి శ్రీదర్శనుడికి స్వస్థత చేకూరింది. అతనికి రాజ్యంపై ఆశ నశించింది. వారసులకు సింహాసనం అప్పగించి, వానప్రస్థానానికి వెళ్లిపోయాడు. నిర్జనారణ్యంలో పళ్లు, కందమూలాలు తింటూ తీవ్ర తపోదీక్షలో మునిగిపోయాడు.

ఒకనాడు ఒక రావిచెట్టు నీడలో కూర్చుని ఉండగా.. ఇద్దరు దివ్యకన్యలు ఆ చెట్టు దిగి వచ్చారు. వాళ్లను చూసి శ్రీదర్శనుడు ఆశ్చర్యపోయాడు. ''ఎవరు మీరు? ఇక్కడికెలా వచ్చారు?'' అని ప్రశ్నించాడు.

**(వచ్చేవారం.. నలకూబరుని శాపం)**